www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 30 మే 2023
5
పశ్చిమ గోదావరి

ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కొత్తపాలెంలో ఉపాధి హామీ కార్మికుడు సోమవారం ఆకస్మికంగా మృతి చెందాడు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కొత్తపాలెంలో సోమవారం ఉదయం ఉపాధిహామీ పనుల్లో భాగంగా పంటబోదె పూడికతీత పనులు చేపట్టారు. ఈ పనులు చేస్తుండగా ఉపాధి హామీ కార్మికులు పోతుల వెంకటేశ్వరరావు (72) ఆకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. దీంతో సహచరులు వెంటనే గట్టుపైకి తీసుకొచ్చి సపర్యాలు చేశారు. స్థానిక వైద్యునికి చూపించగా వెంకటేశ్వరరావు సంఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు నిర్ధారించారు. వెంకటేశ్వరరావుకు భార్య సూర్యకుమారి, ఇద్దరు కుమారులు ఉన్నారు. సమాచారం అందుకున్న ఎంపిడిఒ ఆర్‌సి.ఆనంద్‌కుమార్, ఎపిఒ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి జయరాజు, టెక్నికల్ అసిస్టెంట్ జవ్వాది వెంకటేశ్వరరావు, విఆర్ఒ కుమారి సంఘటనా స్థలిని సందర్శించారు. మృతుని కుటుంబీకులను ఓదార్చారు.

వైస్ ఛైర్మన్లు

అలంకారప్రాయమేనా.

జిల్లా పరిషత్‌లో నిబంధనలు తూచ్

ప్రజాప్రతినిధులున్నా పాలనంతా అధికారుల చేతుల్లోనే

ఛైర్మన్ లేకపోయినా వైస్‌ఛైర్మన్‌కు దక్కని అధికారం

అధికారుల ఇష్టారాజ్యంగా బదిలీలు అంటూ విమర్శలు

రెండేళ్లు పూర్తికాని ఉద్యోగులనూ బదిలీ చేస్తున్నారని చర్చ

S.No	Name of the Vice Chairperson	Position	Date of Birth	Caste	Educational Qualification	Occupation
1	Posina Sri Lekha Member ZPTC Tallapudi	Vice Chairperson -1	09-08-1992	OC	M.Tech	Political affairs
2	Penumala Vijaya Babu Member ZPTC Pedavegi	Vice Chairperson -2	25-03-1995	SC	B.Tech Course Completed & B.Com., General	Poultry Farming

ఒకటో ఛైర్మన్, రెండో ఛైర్మన్ అంటూ తయారు చేసిన నివేదిక

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ పాలనా వ్యవహారం ప్రజానీకంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జెడ్‌పి ఛైర్మన్ రాజీనామా చేసి 15 రోజులు గడిచినా ఆ పదవిని ఖాళీగా పెట్టడంపై ఏఒక్కరూ పట్టించుకోకపోవడం ఏమిటనే చర్చ సాగుతోంది. జెడ్‌పి వైస్ ఛైర్మన్ పదవి ఎందుకని ప్రశ్నలు విన్పిస్తున్నాయి. ఛైర్మన్ లేనప్పుడు జిల్లా పరిషత్ పాలనా బాధ్యతలు నిర్వర్తించాల్సిన వైస్ ఛైర్మన్‌ను ఎందుకు పక్కన పెట్టారనే సందేహాలు అందరిలోనూ నెలకొన్నాయి. ప్రజలెన్నుకున్న ప్రజాప్రతినిధులున్నప్పటికీ అధికారులే అన్నీ తామై ఏకచత్రాధిపత్యంగా జిల్లా పరిషత్ పాలన సాగించడం ఏమిటో ఏఒక్కరికీ అర్థంకాని పరిస్థితి నెలకొంది. జిల్లా పరిషత్‌లో ఏం జరుగుతుందో వైస్ ఛైర్మన్లకు, జెడ్‌పిటిసిలకు కూడా తెలియని పరిస్థితి నెలకొందనే చర్చ నడుస్తోంది. ఛైర్మన్ పదవి ఖాళీగా ఉండటంతో జిల్లా పరిషత్‌లో అధికారులు ఇష్టానుసారంగా వ్యహరిస్తున్నారని, బదిలీల వ్యవహారమే అందుకు నిదర్శనమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 14న జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవికి కవురు శ్రీనివాస్ రాజీనామా చేశారు. నిబంధనల ప్రకారం వైస్‌ఛైర్మన్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించాలి. జిల్లాలో అటువంటి పరిస్థితి లేకుండాపోయింది. ఛైర్మన్ కుర్చీని ఖాళీగా పెట్టి అధికారులు చక్రం తిప్పుతున్నారు. ఇద్దరు వైస్ ఛైర్మన్లు ఉండటం కారణంగా ఎవరికి ఇన్‌ఛార్జి ఇవ్వాలో అనే సందిగ్ధంలో ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూస్తున్నట్లు చెబుతున్నారు. వాస్తవానికి జిల్లాపరిషత్‌కు ఇద్దరు వైస్ ఛైర్మన్లు ఉన్నప్పటికీ నిబంధనల్లో ఒకటో వైస్ ఛైర్మన్, రెండో వైస్ ఛైర్మన్ అంటూ స్పష్టంగా పేర్కొన్న పరిస్థితి ఉంది. అటువంటప్పుడు ఇంకా సందిగ్ధత ఏమిటో అర్థం కావడం లేదు. ఒకవేళ సందిగ్ధత ఉన్నా 15 రోజులపాటు సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేయడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు. ఎప్పటికి పరిష్కారమవుతుందో కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను అలంకార ప్రాయంగా మార్చేసి అధికారులే పెత్తనం చేయడం ఏమిటనే ప్రశ్న అందరినీ వేధిస్తోంది. ఇది చట్ట ప్రకారం ఏమాత్రం సమంజసం కాదనే వాదన విన్పిస్తోంది. జిల్లాలోని మంత్రులు, ఎంఎల్‌ఎలు సైతం దీన్ని పట్టించుకోకపోవడంపై చర్చ నడుస్తోంది.

జెడ్‌పిలో బదిలీలు ఇష్టానుసారమే..?

ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 22 నుంచి 31వ తేదీ వరకూ దరఖాస్తుల స్వీకరణకు అవకాశం ఇచ్చింది. ఏప్రిల్ 30వ తేదీ నాటికి ఒకేచోట రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని, ఒకేచోట ఐదేళ్లుగా పని చేస్తున్న ఉద్యోగులకు బదిలీ తప్పనిసరి అని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అయితే బదిలీల వ్యవహారం జిల్లా పరిషత్‌లో ఇష్టానుసారంగా జరుగుతున్నట్లు సమాచారం. మొత్తం 140 మంది వరకూ ఉద్యోగులు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తుండగా అందులో దాదాపు సగం అంటే 70 మంది వరకూ ఒకేచోట రెండేళ్ళ కాలం పూర్తికాని ఉద్యోగులు ఉన్నట్లు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఒకేచోట రెండేళ్ల సర్వీసు పూర్తికాని ఉద్యోగులను ఏవిధంగా బదిలీ చేస్తున్నారనేది చర్చనీయాంశంగా మారింది. బదిలీల వెనుక పెద్దఎత్తున గూడుపుఠాని జరుగుతున్నట్లు చెబుతున్నారు. జిల్లా పరిషత్ బదిలీల్లో ఒకేచోట రెండేళ్లు పూర్తికాని ఉద్యోగులను బదిలీ చేయడంపై జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించాలని అంతా కోరుతున్నారు. ప్రజాప్రతినిధుల జోక్యం లేకపోవడంతో జిల్లా పరిషత్ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై జెడ్‌పి సిఇఒ కెవిఎస్‌ఆర్.రవికుమార్‌ను వివరణ కోరేందుకు ఫోన్లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, జిల్లా అధికారులు

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పర్యవేక్షణ

అధికారులకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

ప్రజాశక్తి - భీమవరం

'స్పందన'లో వచ్చిన ఫిర్యాదులు పరిష్కారమయ్యే వరకు అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్ఒ కె.కృష్ణవేణి, డిప్యూటీ ట్రెయినీ కలెక్టర్ డి.అఖిల, డిఎస్‌పి బి.త్రినాథ్, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, డిపిఒ జివికె.మల్లికార్జునరావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 156 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఫిర్యాదుదారునికి సమస్య పరిష్కారానికి ఉత్తర్వులిచ్చి సరిపెట్టకుండా, సమస్య పరిష్కారమయ్యే వరకు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. సమస్య పూర్తి పరిష్కారం కాక మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన దుస్థితి ఫిర్యాదుదారులకు ఎట్టి పరిస్థితుల్లో రాకూడదన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా పూర్తి పరిష్కారాన్ని చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

అతిసార నియంత్రణకు విస్తృత ప్రచారం చేయాలి: కలెక్టర్

అతిసార నియంత్రణకు దృష్టి సారించడంతోపాటు సచివాలయాల స్థాయిలో విస్తృత ప్రచారానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో 'అతిసార నియంత్రణ, ముందస్తు చర్యలు'పై సమావేశం నిర్వహించారు. అతిసార నియంత్రణపై వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జూన్ 5 నుండి 17 వరకు విస్తృత ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వైద్యశాఖాధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అతిసార నియంత్రణ మార్గాలైన శానిటేషన్, స్ట్రీట్ ఫుడ్, తాగునీటి కలుషితం కాకుండా చూడటం, ఐస్ తయారీ ఫ్యాక్టరీలను, ప్రయివేటు వాటర్ ప్లాంట్లను, కూల్‌డ్రింక్స్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి సంబంధిత యాజమాన్యాలకు అవగాహన కల్పించాలన్నారు. అతిసార ప్రబలితే ఎలా నియంత్రించాలనే విషయమై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించాలన్నారు. చిన్నారులు ఉన్న ప్రతి ఇంటిని వైద్యసిబ్బంది సందర్శించి తల్లులకు అవగాహన కల్పించడంతో పాటు ఒఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేసి వినియోగంపై పూర్తి వివరాలు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, ఇన్‌ఛార్జి డిసిహెచ్‌ఎస్ డాక్టర్ కె.ప్రవీణ్‌కుమార్, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అధిక ఫీజుల వసూళ్లపై చర్యలు తీసుకోవాలని ధర్నా

వినతి అందిస్తున్న అఖిలపక్ష నేతలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

నిబంధనలను ఉల్లంఘించి చట్టవిరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు చేపట్టి వాటి అనుమతి రద్దు చేయాలని కోరుతూ అఖిలపక్షం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నానుద్దేశించి సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్, సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.దక్షిణామూర్తి, ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, పట్టణ పౌర సమాఖ్య కన్వీనర్ గార రంగారావు, పౌర హక్కుల నాయకులు కౌరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యారంగం ప్రభుత్వ అధీనంలో ఉన్నపటికీ రాష్ట్రంలో మాత్రం కార్పొరేట్ శక్తులే శాసిస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి నర్సరీ నుండి ఉన్నత చదువులు వరకు పెద్దఎత్తున ఫీజు వసూలు చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో సరైన సౌకర్యాలు లేకపోవడం వల్లే కార్పొరేట్ వ్యాపారం పెరగడానికి కారణమన్నారు. ఫీజులపై ప్రభుత్వ జిఒలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. చాలా స్కూళ్లు, కాలేజీల్లో బుక్స్, యూనిఫామ్ అమ్ముతున్నారని అన్నారు. కోచింగ్, డిజిటల్ క్లాసుల పేరుతో ఫీజులతో సంబంధం లేకుండా వసూలు చేస్తున్నారన్నారు. సెలవులో సైతం క్లాసులు నిర్వహించడం వల్ల విద్యార్థులు మానసిక ఆందోళనకు గురౌతున్నారని తెలిపారు. విద్యను వ్యాపారం చేసిన కార్పొరేట్ శక్తులను కట్టడి చేయాలన్నారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం.గాంధీ, రాజు, రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తణుకులో వినతి అందిస్తున్న విఒఎలు

కాలపరిమితి జిఒ రద్దు కోరుతూ విఒఎల ఆందోళన

ప్రజాశక్తి - తణుకు రూరల్

గణపవరంలో..

విఒఎల ఉద్యోగ భద్రతకు ప్రమాదంగా ఉన్న కాల పరిమితి జిఒను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ గత అనేక ఏళ్లుగా ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్తున్న విఒఎల సమస్యలు పరిష్కరించాలన్నారు. విఒఎలకు రూ.10 లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని కోరారు. 15 సంఘాల్లోపు ఉన్న విఒఎలకు వేతనాలు ఇవ్వాలన్నారు. లోకో యాప్ కోసం 5జి ఫోన్లను ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. విఒఎల మెర్జ్ ఆపాలని, అన్ని రకాల బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సీసీ డి.బంగారయ్య, మధులతలకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పార్వతీదేవి, పద్మ, ఎ.పార్వతి, రత్నం, దుర్గ, జమున, విజయలక్ష్మి, దేవి, రత్నకుమారి పాల్గొన్నారు.

గణపవరం: ప్రభుత్వం డ్వాక్రా యానిమేటర్లను దశలవారీగా తొలగించే ప్రయత్నాలను విరమించుకోవాలని సిఐటియు మండల కమిటీ కార్యదర్శి పి.గోవింద్ కోరారు. సోమవారం డ్వాక్రా యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడారు. డ్వాక్రా యానిమేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. తొలగించిన విఒఎలకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. యానిమేటర్లను ప్రభుత్వం తొలగించే ప్రయత్నం మానుకోకపోతే సిఐటియు ఆధ్వర్యంలో పోరు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంపిడిఒ జ్యోతిర్మయికి ఎపిఎం సిహెచ్.రాజేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్డగర్ల సుబ్బలక్ష్మి, ప్రసన్న లక్ష్మి, రత్న మాణిక్యం పాల్గొన్నారు.

యలమంచిలి: తమకు కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, పది లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలనే డిమాండ్లతో స్థానిక వెలుగు కార్యాలయం వద్ద సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో యానిమేటర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్ మాట్లాడుతూ తొలగించిన విఒఎలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, వెలుగు పథకంలో పని చేస్తున్న అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యానిమేటర్లు కనకదుర్గ, విజయలక్ష్మి, శివ సూర్యకుమారి, ఝాన్సీ పాల్గొన్నారు.

ఉపాధి చట్టం జోలికొస్తే మోడీకి గుణపాఠం తప్పదు

ఉపాధి పనుల సందర్శనలో ప్రజాసంఘాలు, సిపిఎం నేతలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

గ్రామీణ ప్రాంతాల్లో కులాలు, మతాలతో సంబంధం లేకుండా పేదలందరికీ ఉపాధి కల్పిస్తున్న చట్టం జోలికొస్తే మోడీకి తగిన గుణపాఠం చెబుతామని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు హెచ్చరించారు. సోమవారం పెనుమంట్ర శివారు మాముడూరు పంట కాలవ సరిహద్దుల్లో పని చేస్తున్న కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, సుబ్బరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కులం, మతంతో సంబంధం లేకుండా పేదలందరికీ పని కల్పిస్తున్న ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్లో నిధులు తగ్గించడం దారుణమన్నారు. దీన్నిబట్టి మోడీకి పేదలపై ఉన్న ప్రేమ ఏపాటిదో అర్థమవుతుందన్నారు. కేరళ ప్రభుత్వం కనీస వేతనం రూ.600 ఇస్తూ, ఈ నెల 15 నుండి ఉపాధి హామీ కూలీలకు సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి అనేక సౌకర్యాలు కల్పిస్తుంటే మన రాష్ట్ర ప్రభుత్వం సౌకర్యాల్లో కోత విధించడం దారుణమన్నారు. ఇప్పటికైనా తొలగించిన సౌకర్యాలు పునరుద్ధరించాలని, పని దినాలు 200 రోజులకు పెంచాలని, పే స్లిప్‌లు ఇచ్చి పోస్టాఫీస్ ద్వారా వేతనాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉపాధి హామీ పరిరక్షణ కమిటీ అధ్యక్షులుగా కొప్పిశెట్టి రేవతి, కార్యదర్శిగా కోడి దుర్గ భవాని, కమిటీ సభ్యులుగా ఆరుగురు ఎన్నికయ్యారు.

ఇరగవరం : కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉపాధి కూలీల పట్ల అనుసరిస్తున్న విధానాలను కూలీలంతా ఐక్యంగా ప్రతిఘటించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు అన్నారు. మండలంలోని రేలంగి పంచాయతీ పరిధి కేతావారిపాలెంలో ఉపాధి హామీ పనుల ప్రాంతాన్ని ఆయన సందర్శించి, కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండుటెండలో పని ప్రదేశంలో కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు నీడ, తాగేందుకు నీళ్లు ఉండడం లేదని, గాయాలేతే ప్రాథమిక చికిత్సకు మెడికల్ కిట్లు కూడా ఇవ్వడం లేదని కూలీలు వీరభద్రరావు దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు దాడికి తెగబడటం దారుణమన్నారు. వ్యవసాయమే ప్రధానంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో నాట్లు, కోతల సమయంలో కొద్దిపాటి పనులు మినహా ఏడాది మొత్తం ఖాళీగానే ఉంటున్నారని, ఈ నేపథ్యంలో ఉపాధి పనులు వారి పొట్ట నింపుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీలో ఉన్న ఇబ్బందులను పరిష్కరించి, 200 రోజులు పనులు చూపి పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పుణ్యవంతుల సత్యనారాయణ, పెచ్చెట్టి రమ్య, గుడాల కనకదుర్గ, కేతా అరుణ, దొమ్మేటి భాస్కరరావు, పాలా భూషణం తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ఉపాధి హామీలో తక్షణమే రెండు పూట్ల పని విధానాన్ని, ఎన్ఎంఎంఎస్ యాప్‌ను పూర్తిగా రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. ఉపాధి పర్యటనలో భాగంగా సోమవారం కృష్ణాయపాలెం, కొత్తూరు, నవాబ్‌పాలెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూలీలకు పే స్లిప్‌లు, సమ్మర్ అలవెన్సును పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఉపాది హామీలో ఉన్న సమస్యలు పరిష్కరించి సక్రమంగా అమలు చేయడానికి ప్రభుత్వాలు కృషి చేయాలని ఆయన హితవుపలికారు. ఈ కార్యక్రమంలో నిర్ల రాజేష్,ముత్యాల సరస్వతిదేవి, వల్లూరి దైవకృప, కాకార్తి బాలాజీ, చాగంటి గౌరమ్మ, రెడ్డి సూర్యప్రభ, గంజి భవాని, దుర్గ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం మండలంలో మాట్లాడుతున్న సోమరాజు

పోడూరులో మాట్లాడుతున్న కేతా గోపాలన్

పెంటపాడు: పేదలకు పట్టెడన్నం పెడుతున్న ఉపాధి హామీ చట్టం జోలికి వస్తే రానున్న రోజుల్లో మోడీకి కూలీలు తగిన గుణపాఠం చెబుతారని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు హెచ్చరించారు. మండలంలోని ఆకుతీగపాడు గ్రామంలో ఉపాధి పనుల చేస్తున్న ప్రాంతాన్ని వారు సందర్శించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి, రంగారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలే కాకుండా పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి పనులు చూపాలన్నారు. కార్యక్రమంలో పెనగంటి దుర్గా, ఉపాధి కూలీలు చీకటిమిల్లి నాగేశ్వరరావు, కొండేటి రత్నంరాజు, కొణతల రత్నంరాజు, దిద్దే పుష్ప, చీకటిమిల్లి కాంత, గురుకురాజు చిన్న వీరస్వామి, కొయ్య సుబ్బారావు, మానుకొండ వీరాస్వామి, కొయ్య లక్ష్మణరావు పాల్గొన్నారు.

పోడూరు: ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో సౌకర్యాల కల్పనలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ విమర్శించారు. జగన్నాథపురం గ్రామంలో ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోపాలన్ మాట్లాడుతూ వేసవి మండుటెండలో నీడ లేక కూలీలు నానావస్థలు పడుతున్నారన్నారు. పేస్లిప్ ఇవ్వాలని కోరారు చేశారు. గత సంవత్సరంలో చేసిన పనుల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలం కార్యదర్శి పిల్లి ప్రసాద్, నేతలు కొడమంచిలి రాజశేఖర్, సిహెచ్ వెంకటేశ్వరరావు,జిల్లా రాజేంద్ర సురేష్ పాల్గొన్నారు.



క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

విద్యుత్ వాహనాలపై కేంద్రీకరించాలి : కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

పర్యావరణానికి హితం కలిగే విద్యుత్ వాహనాల వినియోగంపై ఆలోచన చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'గో ఎలక్ట్రిక్ క్యాంపెయిన్‌ను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. విద్యుత్ కార్లు, మోటారు బైకులు, ఆటోలను పరిశీలించి, వాటి పనితీరు, ధరల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వాతావరణ కాలుష్య నియంత్రణకు ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలన్నారు. పెట్రోల్, డీజిల్ కార్లు ఎక్కువగా వాడడం, పర్యావరణ సమస్య రీత్యా విద్యుత్ వాహనాల వినియోగంపై దృష్టి సారించాలన్నారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వీలైనంత ఎక్కువగా విద్యుత్ వాహనాలను ఉపయోగించి, వాతావరణ సమతుల్యతను కాపాడాలన్నారు. జిల్లా నెడ్‌క్యాప్ మేనేజర్ డివి.ప్రసాద్ మాట్లాడుతూ ఎలక్ట్రిక్ వాహనాల క్యాంపెయిన్ ముఖ్యోద్దేశం కాలుష్యం తగ్గడంతోపాటు వినియోగదారుడికి పెట్టుబడి తగ్గుతుందన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు 48 మాసాలు వాయిదాలు రూపంలో, 9 శాతం వడ్డీతో తమకు కావాల్సిన వాహనాన్ని పొందవచ్చునని తెలిపారు. వాహనాలు కావలసినవారు వి.హరీష్ డెవలప్‌మెంట్ అధికారి సెల్ నెంబరు 9553486987కు సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంజి మోటార్స్ కంపెనీ మేనేజర్ కె.మురళీకృష్ణ, నెడ్‌క్యాప్ సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయల కల్పనే ధ్యేయం

ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, నరసాపురం ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సోమవారం నరసాపురం మండలం లిఖితపూడి గ్రామంలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాలు భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయానికీ రూ.20 లక్షల నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. ప్రతి గడపకూ పర్యటించినప్పుడు స్థానిక ప్రజల కోరిక మేరకు గ్రామాల్లో కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలు వారి కుటుంబంలో జరిగే చిన్న చిన్న శుభకార్యాలను ఈ కమ్యూనిటీ భవనాల్లో నిర్వహించుకోవచ్చునని అన్నారు. రాష్ట్రంలోని సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇవ్వడమే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యోద్దేశమన్నారు. గ్రామస్తులు విద్యుత్ సమస్యను ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. కాలువగట్టు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని, పనులు త్వరలోనే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తామని ప్రసాదరాజు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఎంఎల్‌ఎకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు బొక్కా రాధాకృష్ణ, ఎంపిపి మైలాబత్తుల సోనీ, వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్‌నాయుడు, ఎంపిటిసి చిన్నం వెంకట్రావు, దొంగ మురళీకృష్ణ, పంచాయతీరాజ్ ఎఇ నాగేశ్వరరావు, పోతురాజు, వరలక్ష్మి, చిట్టిబాబు, చప్పల జపాన్, చినిమిల్లి చందు, బెల్లంకొండ ఏసు, వంగలపూడి జక్రరయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరిలో చెత్త వేయొద్దని సిపిఎం వినతి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్



వినతి అందిస్తున్న సిపిఎం నేతలు

గోదావరిలోకి మున్సిపాల్టీ చెత్త వేసి కలుషితం చేయొద్దని, మున్సిపాల్టీ డ్రెయినేజీ నీరు వేములదీవి పంట కాలవలోకి వదలొద్దని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ నరసాపురం మున్సిపాల్టీకి శాశ్వత డంపింగ్ యార్డ్ లేకపోవడం వల్ల ప్రతిరోజూ పట్టణంలో సేకరించిన టన్నుల కొలదీ చెత్తను యథేచ్ఛగా గోదావరిలో వేసేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా గోదావరిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారుల వలల్లో చేపలకు బదులుగా చెత్తాచెదారం పడుతున్నాయన్నారు. తక్షణం మున్సిపాల్టీకి శాశ్వత డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలన్నారు. నరసాపురం పట్టణంలోని మురుగునీరు 10 గ్రామాలకు సాగు, తాగునీరు అందిస్తున్న వేములదీవి పంట కాలవలోకి వదిలేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. లక్ష్మణేశ్వరం కుళాయి చెరువులోకి ఇదే నీరు పంపింగ్ చేసి సరఫరా చేయడం వల్ల ఆయా గ్రామాల ప్రజలు రోగాలబారిన పడుతున్నారని గుర్తు చేశారు. తక్షణం నరసాపురం డ్రెయినేజీ నీరు వేములదీవి పంట కాలువలోకి విడుదల చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పొన్నాడ రాము, నోముల కొండ, గుత్తుల శ్రీరామచంద్రుడు పాల్గొన్నారు.

సంక్షేమ వారధులు వాలంటీర్లు

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న వాలంటీర్లు వారధిలా పని చేస్తున్నారని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కుమదవల్లి గరగపర్రు, పాలకోడేరు గ్రామాలకు చెందిన వాలంటీర్లను సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వాలంటీర్ వ్యవస్థను ప్రారంభించిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్నీ నేరుగా ప్రజలకు అందజేయడంలో వాలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు 98 శాతం అమలు చేసిందన్నారు. పథకాలు అందజేయడంతోపాటు వాటిని వివరించడంలో వాలంటీర్లు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు భూపతి రాజు వంశీకృష్ణమరాజు, సర్పంచి ఇంజేటి మరియమ్మ, ఉప ఎంపిపి ఆదాడ లక్ష్మీ తులసి, వైసిపి మండల అధ్యక్షురాలు కటిక శ్రీదేవి, వేంద్ర ఎంపిటిసి పాల జ్యోతి పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు తీయండి : ఎంఎల్ఎ నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రశాంతమైన పాలకొల్లు నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్, రామోజీరావు, రాధాకృష్ణలు చంద్రబాబు, లోకేష్ పల్లకీ మోస్తున్నట్లు వైసిపి నేతలు వివాదాస్పద ఫ్లెక్సీలు పెట్టారని, ఇది సరికాదని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు విమర్శించారు. వైసిపి ప్రభుత్వం పాలకొల్లులో చేసిందేమీ లేక ఇటువంటి ఫ్లెక్సీలు పెట్టిందన్నారు. తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ జైల్లో ఉన్నప్పుడు ఆయన అనుయాయులు రావణాసురుల్లా రాజ్యమేలడం, బాబాయిని గొడ్డలితో నరకడం వంటి ఫ్లెక్సీలు తామూ పెట్టగలమని హెచ్చరించారు. వెంటనే పెట్టిన ఫ్లెక్సీలు తీసివేయాలని హెచ్చరించారు. రాష్ట్రంలో అల్లర్లు జరిగితే అధికారులు రాకుండా పోలీసులు వస్తున్నారని, ఇది పోలీస్ రాజ్యంగా జగన్ మార్చారని విమర్శించారు. రాజమండ్రిలో ప్రకటించిన ప్రణాళిక ట్రైలర్ మాత్రమేనని, దసరాకు పూర్తి సినిమా ఉంటుందని చెప్పారు. మేనిఫెస్టో చూసి అప్పుడే వైసిపి నేతలు దడదడలాడుతున్నారని చెప్పారు. సమావేశంలో టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, జివి, కర్నేన రోజారమణి, మామిడి శెట్టి పెద్దిరాజు, అల్లం తాతాజీ, మండాది అవినాష్ పాల్గొన్నారు.

ద్వితీయ ఉత్తమ లయన్స్ క్లబ్‌గా పాలకొల్లు

ప్రజాశక్తి - పాలకొల్లు

భీమవరంలో జరిగిన లయన్స్ క్లబ్ మల్టిపుల్ జిల్లా సదస్సులో పాలకొల్లు లయన్స్ క్లబ్ ద్వితీయ ఉత్తమ క్లబ్‌గా ఎన్నికైంది. నెల్లూరు నుండి శ్రీకాకుళం వరకూ ఉన్న ఆరు జిల్లాల్లో ఉన్న లయన్స్ క్లబ్‌లకు గాను పాలకొల్లు లయన్స్ క్లబ్ ఈ అవార్డు పొందింది. ఈ అవార్డును క్లబ్ మల్టిపుల్ డిస్ట్రిక్ట్ కౌన్సిల్ అధ్యక్షులు అనిల్ కుమార్ శేర్, మాజీ లయన్స్ క్లబ్ అంతర్జాతీయ డైరెక్టర్ చిగురుపాటి వరప్రసాద్ చేతులమీదుగా క్లబ్ అధ్యక్షులు ముచ్చర్ల వెంకట సత్యనారాయణ, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ ఎన్ఎ.అన్నపూర్ణ, కార్యదర్శి చల్లా వెంకట ఆదినారాయణ, కోశాధికారి మాఘం.శ్రీనివాసరావు పొందారు. ఈ సందర్భంగా డాక్టర్ సిహెచ్.బాబ్జీ, ఛాంబర్ అధ్యక్షులు కారుమూరి నర్సింహారావు, రీజియన్ ఛైర్మన్ కారుమూరి రామలింగేశ్వరరావు, జోన్ ఛైర్మన్ కట్టా రామకృష్ణ, ఎ.పాపారావు నాయుడు, ఎన్.సీతారామారావు, సొలస రాంప్రసాద్ తదితరులు టీమ్‌ను అభినందించారు.

కళాశాలకు సహకారం అందిస్తాం

సానా సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు ప్లేస్మెంట్స్‌లో, ఇంటెన్షిప్ అందించడంలోనూ తమ వంతు సహకారం అందిస్తామని అమెరికాలోని న్యూ జెర్సీ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల అల్యూమిని అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (సానా) సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు తమకు హామీ ఇచ్చారని కళాశాల ప్రిన్సిపల్ ఎం.జగపతిరాజు చెప్పారు. ఈ నెల 27వ తేదీన న్యూజెర్సీలో అమెరికాలోని కాలిఫోర్నియా, టెక్సాస్, ఫ్లోరిడా, డిసి, అట్లాంట, బోస్టన్ ప్రాంతాల్లోని ఎస్ఆర్‌కెఆర్ పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తమకు విద్యనందించిన కళాశాల ప్రగతికి అల్యూమిని పేరు శాశ్వతంగా గుర్తుండి పోయే విధంగా ఒక నిర్మాణం చేయడంతో పాటు విద్యార్థులకు తమ వంతు సహకారం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ఆర్‌కె నిశాంత్ వర్మ అల్యూమిని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. 43 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర గలిగిన కళాశాల భారతదేశంలోని ప్రముఖ విద్యాసంస్థగా ప్రగతి సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో అమెరికాలోని ఎస్ఆర్‌కె అల్యూమిని అసోసియేషన్ చెందిన ధూళిపాళ్ల భాను ప్రకాష్, పి.శ్రీనివాసరాజు, వేణు మైనేని, బివి రమణ, చేకూరి సాయినాథ్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - కాళ్ల

విద్యార్థి దశలో మరపురాని జ్ఞాపకాలను నెమరువేసుకునే ఆత్మీయ సమ్మేళనం ఎన్నటికీ మరువలేనిదని పలువురు పూర్వ విద్యార్థులు అన్నారు. కాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సుమారు 26 ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకేచోట చేరి ఆత్మీయ పలకరింపులతో యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సంతోషంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామంటూ తోటి విద్యార్థులకు ఉపయోగపడతామంటూ తీర్మానాలు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా తమ వయసుని సైతం పక్కన పెట్టి వినోద కార్యక్రమాల్లో పాల్గొని గీతాలాపన చేస్తూ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఆత్మీయ కలయికకు కృషి చేసిన కోరుకొండ నాగేశ్వరరావు, పోతినీడి శ్రీనివాసు, కొనిశెట్టి సురేష్, చిత్తజల్లు గిరిబాబు, బావిశెట్టి కళ్యాణ్ చక్రవర్తి, కుమారి, వనిత తదితరులను తోటి విద్యార్థులు అభినందించారు.

మా భూముల జోలికొస్తే ఊరుకోం

20వ రోజుకు పాలకోడేరు రైతుల నిరసన

ప్రజాశక్తి - పాలకోడేరు

పరిహారం ఇస్తామని భూములు తీసుకుని ఇప్పుడు మొహం చాటేస్తున్న ప్రభుత్వం, అధికారులు మా భూముల జోలికొస్తే చూస్తూ ఊరుకోబోమని పాలకోడేరు జగనన్న ఇళ్ల స్థలాలకు భూములిచ్చిన రైతులు హెచ్చరించారు. తమ భూముల్లో ఇళ్ల నిర్మాణానికి పూనుకుంటే ఆందోళనను తీవ్రం చేస్తామని హెచ్చరించారు. పాలకోడేరు జగనన్న లేఅవుట్ స్థలాలకు భూములిచ్చిన రైతులు పరిహారం కోసం చేపట్టిన నిరసన దీక్షలు సోమవారం 20వ రోజుకు చేరాయి. రోజుల తరబడి న్యాయం కోసం దీక్షలు చేస్తుంటే అధికారులు, అధికార ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు నష్టపరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు కె.సత్యనారాయణ, నల్లి రామలక్ష్మి, స్తంభలదీవి సాయిబాబు పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న బాధిత నిరుపేద రైతులు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

విద్యార్థుల భవితకు భరోసా

మాలవానితిప్ప హైస్కూల్లో మెరుగైన విద్యాబోధన - పది ఫలితాల్లో భీమవరం డివిజన్‌లో ప్రథమ స్థానం

ప్రజాశక్తి - కాళ్ల

కార్పొరేట్‌కు దీటుగా విద్యార్థుల భవితకు భరోసా కల్పించే పాఠశాల మాలవానితిప్ప హైస్కూల్. మండలంలోని ఉప్పుటేరు తీర ప్రాంతంలో మారుమూల గ్రామమైన మాలవానితిప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విద్యతోపాటు, క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నారు. దీంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, దాతల సహకారంతో పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు.

మాలవానితిప్ప హైస్కూల్

పేదల బతుకుల్లో విద్యా వెలుగులు..

భీమవరం పట్టణానికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న మారుమూల పల్లెటూరు మాలవానితిప్ప. పేదల బతుకుల్లో వెలుగులు నింపాలనే సంకల్పంతో అప్పటి గ్రామ సర్పంచి వెంకట్రామరాజు 50 సంవత్సరాల క్రితం గ్రామంలో ఓ తాటాకు పాకలో ప్రభుత్వ సహకారంతో ప్రాథమిక పాఠశాలను నెలకొల్పారు. ఆ తర్వాత సర్పంచి వెంకట్రామరాజు ప్రోత్సాహంతో 2005లో ప్రాథమికోన్నత పాఠశాలగా మార్పు చేశారు. అప్పటి మంత్రి కలిదిండి రామచంద్రరాజు సహకారంతో పాఠశాలకు నూతన భవనం నిర్మించారు. ఆ తర్వాత అప్పటి ఎంఎల్ఎ పాతపాటి సర్రాజు ప్రోత్సాహంతో పాఠశాలకు నాలుగు తరగతి గదులు నిర్మించారు.

హైస్కూల్‌గా మార్పు..

2007లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయ్యింది. సర్పంచి మంతెన వెంకట్రాజు, అప్పటి ఉపాధ్యాయులు గణేశ్న కృష్ణారావు, కోరశిఖ కృష్ణమూర్తి ఉన్నత పాఠశాలగా తీర్చిదిద్దారు. పాఠశాలకు 1500 పుస్తకాలతో గ్రంథాలయం ఏర్పాటు చేశారు. పాఠశాల చుట్టుపక్కల ప్రాంతాల నుంచి సుమారు 159 మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. శరీర దారుఢ్యానికి, మనోవికాసానికి ఎంతో దోహదపడుతుందనే ఉద్దేశంతో గ్రామంలోని కొంత మంది దాతలు అరెకరం స్థలాన్ని క్రీడా ప్రాంగణానికి సమకూర్చారు.

మెరుగైన సదుపాయాలు..

పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో వర్చ్యువల్ క్లాస్ రూమ్ (విసిఆర్), రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ క్లాస్ రూమ్ (డిసిఆర్)లు ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ నిధులతో పాఠశాల క్రీడా ప్రాంగణానికి చుట్టూ నిర్మించిన ప్రహరీ గోడ నిర్మాణంలో దాతలు 20 శాతం నిధుల భాగస్వామ్యాన్ని అందించారు.

కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్)కు పాఠశాల నుంచి గతేడాది కొల్లాటి శాలిని, ఈ సంవత్సరం గండికోట జయశ్రీ ఎన్నికయ్యారు. అలాగే పాఠశాలలో మౌలిక సదుపాయాలు, అదనపు తరగతి గదులు నిర్మాణం నిమిత్తం కోటి రూపాయల నిధులు మంజూరయ్యాయి. మూడో తరగతి గదుల నిర్మాణం పూర్తయ్యింది. మిగిలిన పనులు పూర్తి కావాల్సి ఉంది. పాఠశాల ప్రారంభం నుంచి పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం క్రమంగా పెరుగుతోంది. పాఠశాల రెండుసార్లు నూరుశాతం ఉత్తీర్ణత సాధించింది. ఏటా సరాసరి 80 శాతం ఫలితాలను కైవసం చేసుకుంటోంది.

పదిలో డివిజన్‌లో ప్రథమ స్థానం

పి.శ్రీనివాసరాజు, ప్రధానోపాధ్యాయులు, మాలవానితిప్ప హైస్కూల్

ఇటీవల పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మా పాఠశాల భీమవరం డివిజన్‌లో ప్రథమ స్థానం సాధించింది. పది పరీక్షల సమయంలో ప్రత్యేక తరగతులు నిర్వహించాం. వంద రోజుల ప్రణాళికను రూపొందించి అమలుపర్చాం. పండగ సెలవుల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించాం. విద్యార్థులకు యుటిఎఫ్ జిల్లా కోశాధికారి పట్టాభి రామయ్య టెస్ట్ పేపర్లు అందజేశారు. ఉపాధ్యాయులు, సర్పంచి సాగిరాజు సుబ్బరాజు, మాజీ సర్పంచి మంతెన వెంకట్రాజు, విద్యా కమిటీ ఛైర్మన్ చిలువూరి రాణి సమిష్టి కృషి చేశారు. ఈ విద్యా సంవత్సరం పది ఫలితాల్లో భీమవరం డివిజన్‌లో 93 శాతం ఉత్తీర్ణతతో మాలవానితిప్ప హైస్కూల్ ప్రథమ స్థానం సాధించడం గర్వంగా ఉంది.

పేదలను ధనికులుగా మార్చే సత్తా చంద్రబాబుకే ఉంది

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవ మహానాడు మహాసభను విజయవంతం చేసిన జిల్లా టిడిపి కుటుంబ సభ్యులకు పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి సోమవారం ధన్యవాదాలు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమని, చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టనున్నారనేందుకు మహానాడు విజయమే నిదర్శనం అన్నారు. చంద్రబాబు ప్రకటించిన సంక్షేమ పథకాల ద్వారా మహిళలకు, యువతకు, రైతులకు పెద్దపీట వేశారన్నారు. పేదలకు పెత్తందారులకు యుద్ధం అంటున్న జగన్ పేదల సొమ్ములతో

తోట సీతారామలక్ష్మి

వేలకోట్ల రూపాయలు అక్రమ సంపాదన సృష్టించుకుని పేదలను నిరుపేదలుగా మార్చారన్నారు. పేదలను ధనికులుగా చేయగల సత్తా చంద్రబాబుకు ఉందని తెలిపారు.

నరసాపురం టౌన్ :ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా జరిగిన మహానాడు కార్యక్రమం విజయవంతమైందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. నరసాపురం నియోజకవర్గ నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిపక్షాలు బస్సులను అడ్డుకున్నప్పటికీ జన సందోహాన్ని ఆపలేకపోయారన్నారు. నరసాపురం, మొగల్తూరు మండల, పట్టణ అధ్యక్షులు గుబ్బల నాగరాజు, వాతాడ ఉమామహేశ్వరరావు, జక్కం శ్రీమన్నారాయణ మాట్లాడారు ఈ కార్యక్రమంలో పాలూరు బాబ్జీ, కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, పొన్నాల నాగబాబు, కొల్లు పెద్దిరాజు, అందే రామకృష్ణ పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా వైసిపి : పివిఎల్

ప్రజాశక్తి - ఉండి

పెత్తందారులకు, నిరుపేదలకు జరిగే యుద్ధంలో నిరుపేదలకు వైసిపి అండగా ఉంటుందని డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలుపుతూ సోమవారం వైసిపి కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఉండి నియోజకవర్గాన్ని తమ ఖాతాలో వేసుకునేందుకు ప్రతి నాయకుడూ, కార్యకర్తా ఇప్పటి నుండే కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, నాయకులు గులిపల్లి అచ్చారావు, కొండవీటి సాంబశివరావు, రణస్థల మహంకాళి పాల్గొన్నారు.

పాలకొల్లులో వైసిపి ర్యాలీ

కాళ్ల:రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నాలుగు సంవత్సరాలుగా నవరత్నాలను నిర్విరామంగా అమలు చేస్తున్నారని, మరోసారి వైసిపిని గెలిపించాలని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. మండలంలో వైసిపి నాలుగేళ్ల పాలనకు మద్దతుగా పివిఎల్ నరసింహరాజు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ సోమవారం నిర్వహించారు. పెదఅమిరంలో వైసిపి క్యాంపు కార్యాలయం నుంచి బైక్‌ర్యాలీ పెదఅమిరం, జక్కరం, కాళ్ల, జువ్వలపాలెం, ఏలూరుపాడు వంతెన వరకూ సాగింది. ఈ సందర్భంగా నరసింహరాజు మాట్లాడుతూ చంద్రబాబు పేదల ఇళ్ల స్థలాలను శ్మశానవాటికతో పోల్చి పేదలను దారుణంగా అవమానించారన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా సంక్షేమ పథకాలను ముందుకు సాగిస్తున్న ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ ర్యాలీలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, పెన్మెత్స విశ్వనాథరాజు, జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, కోపల్లె సొసైటీ అధ్యక్షులు వేగేశ్న జయ రామకృష్ణంరాజు, కలవపూడి సొసైటీ అధ్యక్షులు పెన్మెత్స దుర్గా ప్రసాదరాజు పాల్గొన్నారు.

పాలకొల్లు : పెత్తందార్లపై పేదల యుద్ధం అంటూ పట్టణంలో సోమవారం సాయంత్రం వైసిపి నేతలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, చెల్లెం ఆనంద ప్రకాష్ ర్యాలీలో పాల్గొన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి ర్యాలీగా కార్యకర్తలు విచ్చేశారు. పవన్ కళ్యాణ్, చంద్రబాబు పల్లకీ మోసే కట్ అవుట్లతో కార్యకర్తలు ఊరేగారు. ర్యాలీలో గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం పట్టణంలోని బిఆర్‌ఎంవి మున్సిపల్ హైస్కూల్లో బహిరంగ సభ నిర్వహించారు.

పంచాయతీ పాలకవర్గం సమావేశంలో మాట్లాడుతున్న వార్డు సభ్యులు

కార్యదర్శిని అడ్డుకున్న టెండర్ వేసిన అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు

అడ్డగోలు తీర్మానాలు.. అభ్యంతరాలు

పంచాయతీ కార్యదర్శి, సర్పంచి, ఉప సర్పంచి తీరుపై
పలువురు పాలకవర్గ సభ్యుల ఆగ్రహం
అవినీతికి పాల్పడ్డారంటూ ఆరోపణ
టెండర్ పోస్టులకు సమాధానం చెప్పాలంటూ
కార్యదర్శిని అడ్డుకున్న టెండర్ దారులు
రసాబాసగా మొగల్లు పంచాయతీ పాలకవర్గ సమావేశం

ప్రజాశక్తి - పాలకోడేరు

మొగల్లు పంచాయతీలో అడ్డగోలు తీర్మానాలు చేసి బిల్లులు చెల్లింపులు చేసి అవినీతికి పాల్పడుతున్నారంటూ పంచాయతీ పాలకవర్గ సభ్యులు కొంతమంది ఆరోపించారు. పంచాయతీ సర్పంచి, ఉప సర్పంచి, పంచాయతీ కార్యదర్శులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఒక వర్గానికి చెందిన కొంతమందికి మాత్రమే పంచాయతీ తీర్మానాలు, లావాదేవీలు, అభివృద్ధి పనుల నిర్వహణ వంటి విషయాలు చెబుతున్నారని, మిగిలిన వారు వార్డు సభ్యులు కాదా అని ప్రశ్నించారు. మొగల్లు పంచాయతీ సాధారణ సమావేశాన్ని కార్యదర్శి కె.వెంటరాజు ఆధ్వర్యంలో సర్పంచి మల్లిపూడి కృష్ణకుమారి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో 23 అంశాలతో కూడిన ఎంజెండాను ప్రవేశపెట్టగా పలు అంశాలపై సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. పంచాయతీ జమా ఖర్చులు, పంచాయతీ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు ఖర్చుచేయగా ఈ మొత్తానికి సంబంధించి చెల్లింపులు చేసేందుకు తీసుకొచ్చిన ప్రతిపాదనలపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 1, 4, 5, 7 వార్డు సభ్యులు పెనుమత్స పద్మావతి, పెనుమత్స బలరామ కృష్ణంరాజు, పెనుమత్స వెంకటరాజు, జె.బాలయ్య మాట్లాడారు. గ్రామంలోని తాగునీటి చెరువు, పశువుల చెరువు పూడికతీత పనులు, గట్లు పటిష్టం చేసేందుకు చేసిన పనుల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. పనులు పూర్తయిన తర్వాత దానికి సంబంధించి అంశాలను అజెండాలో ఏవిధంగా పొందుపరుస్తారని ప్రశ్నించారు. పంచాయతీ కార్యదర్శి వెంకట్రాజు, ఉపసర్పంచి సహకారంతో అడ్డగోలు వ్యవహారాలు చేస్తున్నారని విమర్శించారు. గ్రామంలో రెండు చోట్ల కల్వర్టుల నిర్మాణం పూర్తయిన తర్వాత బోర్డు అనుమతి కోరడం శోచనీయమన్నారు. అలాగే స్టేట్ బ్యాంకు రోడ్డులో సీసీ డ్రెయినేజీ తవ్వి ఆ మట్టి ఎటు తరలిపోయిందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. పంచాయతీ చెరువులో పూడికతీత, గట్లు బలపర్చడానికి రూ.లక్షల్లో బిల్లులు డ్రా చేయడంపై అభ్యంతరాలు తెలిపారు. తమకు తీర్మానంలో రూ.3 లక్షలని చెప్పి రూ.6 లక్షలకుపైగా నిధులు డ్రా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రెయినేజీపై ప్లేట్ల నిర్మాణానికి రూ.3 లక్షలు బిల్లులు పెట్టారన్నారు. పంచాయతీకి సంబంధించి విద్యుత్ ఇంజిన్లతో పంచాయతీ చెరువులను నింపడానికి కూడా గత ఏడాది సుమారు రూ.రెండు లక్షల బిల్లులు పెట్టడం సరికాదన్నారు. ఇటీవల పంచాయతీల్లో 11 మందిని ఒప్పంద పద్ధతిలో నియమించుకునేందుకు వేసిన టెండరుపై వాగ్వాదం జరిగింది. టెండర్ ద్వారా తక్కువ వేతనానికి పనిచేస్తామంటూ వచ్చిన వారిని కాదని పాత వారినే కొనసాగించాలంటూ కొందరు సభ్యులు తీర్మానం చేయాలని పట్టు పట్టడంపై మరి కొంతమంది అభ్యంతర వ్యక్తం చేశారు. పలువురు సభ్యులు దీనిపై ఓటింగ్ నిర్వహించాలని కోరగా ఒప్పంద పద్ధతిలో నియామకాలకు టెండర్లు పిలిస్తే నిబంధనలకు విరుద్ధంగా ఓటింగ్ ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. కొంతమంది సభ్యులు ఓటింగ్ తో ఏకపక్షంగా టెండర్లు పిలిచిన వారిని కాదని పాత వారికే పోస్టులు ఇచ్చే విధంగా తీర్మానం చేశారు.

పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన

తక్కువ జీతానికి టెండర్లు వేసిన వారిని కాదని ఎక్కువ జీతానికి టెండర్లు వేసిన వారికి ఉద్యోగాలిస్తూ తీర్మానం చేసిన పంచాయతీ కార్యదర్శి వెంకటరాజు తీరు పట్ల టెండర్‌దారులు వారి కుటుంబ సభ్యులు పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తీర్మానం చేశారని దీనిపై లిఖితపూర్వకంగా రాసి ఇవ్వాలని గ్రామ వైసిపి నాయకురాలు జాలే సునీత, కార్యదర్శి వెంకట రాజును నిలదీశారు. సరైన సమాధానం చెప్పేంతవరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదని సునీత భీష్మించారు. ఈ నేపథ్యంలో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. అయితే కార్యదర్శి లిఖితపూర్వకంగా రాసించేందుకు ఒప్పుకోవడంతో ఆందోళన సద్దుమణిగింది.

తక్కువ జీతానికి టెండర్ వేసిన వారికి ఉద్యోగాలు

పంచాయతీ కార్యదర్శి కె.వెంకటరాజు

నా వస్తున్న లేనిపోని ఆరోపణలు అవాస్తవం. నిబంధనల ప్రకారమే విధులు నిర్వహిస్తున్నాం. తక్కువ జీతానికి టెండర్ వేసిన వారికే ఉద్యోగాలిస్తాం. చెరువులో పూడికతీత, గట్లు పటిష్టం, గత వేసవిలో చెరువు నింపడానికి సంబంధించిన పనులను పాత పంచాయతీ కార్యదర్శి సమయంలో నిర్వహించారు. ఎంబుక్ రికార్డింగ్ కూడా గత పంచాయతీ కార్యదర్శి సమయంలోనే జరిగింది.

ఘనంగా ముదునూరి పుట్టినరోజు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పుట్టినరోజు వేడుకలు వైసిపి నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, ఉప సర్పంచి బోణం నరసింహారావు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ

కొనసాగిన వేసవి శిక్షణా శిబిరం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు సోమవారం కొనసాగాయి. ఈ సందర్భంగా 13వ వార్డు కౌన్సిలర్ తోట అరుణకుమారి మాట్లాడారు. విద్యార్థులు మంచి పుస్తకాలు చదవాలన్నారు. అనంతరం పిల్లలకు స్నాక్స్ పంపిణీ చేశారు. అలాగే పుస్తక పఠనం, పుస్తక సమీక్ష నిర్వహించారు. తరువాత పిల్లలకు కథలు చెప్పారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ వివిఎస్.నాయుడు పిల్లలకు కంప్యూటర్ గురించి వివరించారు. కార్యక్రమంలో తోట సురేష్, రేవంత్, సూర్యం బాబు, సుధీర్ మోహన్ పాల్గొన్నారు.

ఇలపర్రులో ర్యాలీ

ప్రజాశక్తి - పెనుగొండ

కిశోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ కె.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం ఇలపర్రు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సోమవారం కె.నాగలక్ష్మి మాట్లాడుతూ కిశోర బాలికలపై ఆరోగ్యం ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

వాహనదారులు హెల్మెట్ ధరించాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - ఉండి

హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనదారులు అతివేగంతో ప్రయాణించి ప్రాణాలను పోగొట్టుకుని వారి కుటుంబాల్లో తీరని విషాదం నింపుతున్నారని, ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ గంగాధర్‌రావు తెలిపారు. ఉండి గోరింతోట చర్చి సమీపంలో సోమవారం హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారుల ప్రాణాలను కాపాడేందుకే ప్రభుత్వం హెల్మెట్‌పై అవగాహన సదస్సులు నిర్వహిస్తోందన్నారు. వాహనదారులు ఎన్నిసార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన నిర్లక్ష్యం వహిస్తున్నారని, తప్పనిసరి పరిస్థితుల్లో జరిమానా విధించడంతోనైనా మారుతారని తాము భావిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, సిబ్బంది, ద్విచక్ర వాహనదారులు పాల్గొన్నారు.

వైసిపివి దిగజారుడు రాజకీయాలు

ప్రజాశక్తి - ఉండి

ప్రజలకు తప్పుడు సంకేతాలిచ్చి వారి దృష్టిని మరల్చేందుకు జగన్ ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలు చేస్తోందని తెలుగు యువత నరసాపురం పార్లమెంటు కార్య నిర్వాహక కార్యదర్శి బురిడీ రవిబాబు విమర్శించారు. మహానాడు కార్యక్రమాన్ని భగ్నపరచాలనే కుట్రతో జగన్ ప్రభుత్వం రాజధాని ప్రాంతంలో ఇంటి స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు మహానాడులో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారని చెప్పారు. దీంతో ప్రజలకు మరో తప్పుడు సంకేతం అందించేందుకు చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలపై వైసిపి నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. రాజధానిని శ్మశానంగాను, ఎడారి గాను అభివర్ణించిన చరిత్ర వైసిపి నాయకులకే దక్కుతుందన్నారు. పేదవాడి ఇంటికి సెంటు స్థలం ఎలా సరిపోతుందని ప్రశ్నించిన చంద్రబాబు నాయుడుపై అబండాలు మోపడం ఎంతవరకూ న్యాయమన్నారు.

రామేశ్వరస్వామికి రూ.2.84 లక్షల ఆదాయం

పెనుమంట్ర:నత్తారామేశ్వరంలోని రామేశ్వరస్వామి వారి దేవస్థానంలో వైశాఖమాసం పూర్తయిన సందర్భంగా హుండీ లెక్కించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల శ్రీధర్ తెలిపారు. సోమవారం గ్రామ పెద్దలు తణుకు దేవాదాయ శాఖ తనిఖీదారి జి.వరప్రసాద్ సమక్షంలో హుండీ లెక్కించగా రూ.2,84,109 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వెలగల ధర్మారెడ్డి, గ్రామ పెద్దలు అయ్యప్పరెడ్డి పాల్గొన్నారు.